సాక్షి అనంతపురం

శుక్రవారం । 24 । మే । 2024



టన్ను చీనీ రూ.38 వేలు

స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.38 వేలు పలికాయి.



ఉపాధిలో నిర్లక్ష్యం వీడండి

నిర్లక్ష్యం వీడి కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సిబ్బందిని జెడ్పీ సీఈఓ నిదియాదేవి ఆదేశించారు. 8లో

గరిష్టం/కనిష్టం
39.6°/24.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి.. ఉక్కపోత, వడగాల్పులు తీవ్రత కొనసాగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

జూన్ 6 వరకూ బాణాసంచా వినియోగంపై నిషేధం



కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనల నివారణ, శాంతిభద్రతలను కాపాడేందుకు జూన్ 6 వరకూ జిల్లాలో బాణా సంచా (టపాసులు) వినియోగం, రవాణాపై నిషేధం విధించారు. ఈ మేరకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత గెలుపొందిన అభ్యర్థులు, వారి మద్దతుగా విజయోత్సవాలు నిర్వహించే క్రమంలో బాణాసంచా కాల్చడం ద్వారా తలెత్తే పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ నివేదిక ఆధారంగా బాణాసంచా తయారీ, అమ్మకం, కొనుగోలు, వినియోగం, రవాణాపై నిషేధం విధించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. బాణాసంచా దుకాణాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఉల్లంఘిస్తే భారతీయ శిక్షాస్మృతి 1860లోని సెక్షన్ 436 ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

అప్రమత్తంగా ఉండండి



ఎస్ఐ చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

శింగనమల: కౌంటింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. గురువారం రాత్రి శింగనమల, బుక్కరాయసముద్రం సర్కిల్ పోలీస్ స్టేషన్లను ఎస్పీ ఆకస్మిక తనిఖీ చేశారు. సమస్యాత్మక గ్రామాలు, తాజా పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైండోవర్లు త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలను తరచూ సందర్శించాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించాలన్నారు. కౌంటింగ్ తరువాత గ్రామాల్లో హింసకు తావులేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశులు, ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

8 చోట్ల ఫ్లాగ్‌మార్చ్‌లు



అనంతపురంలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

అనంతపురం: జిల్లాలో గురువారం పోలీసులు 8 చోట్ల ఫ్లాగ్‌మార్చ్‌లు, 5 ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించారు. రాయదుర్గం, శింగనమల, పుట్లూరు, ఆత్మకూరు,తాడిపత్రి పట్టణాల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లు చేపట్టారు. సమస్యలు సృష్టించే వారిని, వారి స్థావరాల్లో జల్లెడ పట్టారు. 178 మంది రౌడీషీటర్లు, కిరాయి హంతకులు, ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న 866 మందిని బైండోవర్ చేశారు.

నారసింహా.. పాహిమాం



గోవాహనంపై విహరిస్తున్న భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారు భూదేవి, శ్రీదేవి సమేతంగా గోవాహనం, శేషవాహనంపై విహరించారు. ఉదయం స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుప్రభాతం, మహాభిషేకం, అలంకరణ,అర్చన, ఉత్సవ నిత్యహోమం, బలిహరణ కార్యక్రమాలు చేపట్టారు.అనంతరం విశేషంగా అలంకరించిన గోవాహనం, శేష వాహనంపై ఊరేగుతూ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథచార్యులు, బాలాజీ స్వామి పాల్గొన్నారు.

విత్తన పంపిణీకి వేళాయె

- నేటి నుంచి ఆర్‌బీకేల్లో విత్తన వేరుశనగ పంపిణీ
- లాంఛనంగా ప్రారంభించనున్న కలెక్టర్ వినోద్‌కుమార్
- 76,710 క్వింటాళ్ల పంపిణీకి ప్రణాళిక



విత్తన వేరుశనగ



ఆర్‌బీకేల్లో పంపిణీకి సిద్ధంగా వేరుశనగ బస్తాలు

ఆర్‌బీకేలు	380
విత్తన వేరుశనగపై రాయితీ శాతం	40
పంపిణీ చేసే రకాలు	కే-6, టీసీజీఎస్-1694, కదిరి-లేపాక్షి 1812
నిల్వ చేసిన విత్తన వేరుశనగ	30 వేల క్వింటాళ్లు
రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు	40,704

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వేరుశనగ పంపిణీ ప్రారంభం కానుంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులతో సంబంధం లేకుండా అధికారులు ఆర్‌బీకేల్లో విత్తన కాయల పంపిణీ ప్రారంభించనున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ గుమ్మఘట్టలో లాంఛనంగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. వ్యవసాయ శాఖ, ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో జిల్లాకు కేటాయించిన 76,710 క్వింటాళ్లలో ఇప్పటికే 30 వేల క్వింటాళ్లు ఆర్‌బీకేల్లో నిల్వ చేశారు. కే-6,టీసీజీఎస్-1694 రకం విత్తన వేరుశనగ పూర్తి ధర రూ. 9,500 కాగా, అందులో 40 శాతం అంటే 3,800 రాయితీ పోనూ రైతులు తమ వాటా కింద రూ.5,700 చెల్లించాల్సి ఉంటుంది. కదిరి-లేపాక్షి 1812 రకం ధర రూ.8,700 కాగా, 40 శాతం రూ.3,480 పోనూ రైతులు రూ.5,220 చెల్లించాలి. ఒక్కో రైతుకు గరిష్టంగా 90 కిలోలు (30 కిలోల బస్తాలు మూడు) పంపిణీ చేయనున్నారు. కే-6, టీసీజీఎస్-1694 రకం 30 కిలోల బస్తాకు రైతులు రూ.1,710 చెల్లించాలి. కదిరి-లేపాక్షి 1812 రకం అయితే రాయితీ పోనూ రూ. 1,566 ప్రకారం చెల్లించాలి.

ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యం..

జిల్లాలో ఈ నెల 18 నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించారు. ఇప్పటి వరకు 40,704 మంది రైతులు 35,933 క్వింటాళ్లకు బయోమెట్రిక్, మొబైల్ ఓటీపీ విధానంలో పేర్లు నమోదు చేసుకున్నారు. విత్తన పంపిణీలో ఎస్సీ ఎస్టీ, కౌలు రైతులు, చిన్న సన్నకారు రైతులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. జిల్లాకు 76,710 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించగా, అందులో కదిరి-లేపాక్షి రకం 2 వేల క్వింటాళ్లు, టీసీజీఎస్-1694 రకం 1,765 క్వింటాళ్లు ఇవ్వగా మిగతా కే-6 ఇవ్వనున్నారు. అత్యధికంగా కళ్యాణదుర్గం డివిజన్‌కు 21,800 క్వింటాళ్లు కేటాయించగా, అనంతపురం డివిజన్‌కు 14,400 క్వింటాళ్లు, రాయదుర్గం డివిజన్‌కు 14,150, ఉరవకొండ డివిజన్‌కు 9,600, గుత్తి డివిజన్‌కు 9,200, తాడిపత్రి డివిజన్‌కు 2,400 క్వింటాళ్లు కేటాయించారు. మరికొంత బఫర్‌స్టాక్ కింద అందుబాటులో ఉంచనున్నట్లు వ్యవసాయశాఖ, ఏపీ సీడ్స్ అధికారులు తెలిపారు.

3.46 లక్షల హెక్టార్లలో ఖరీఫ్!

ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్లలో అన్ని రకాల పంటలు సాగులోకి రావచ్చని అంచనా వేశారు. అందులో ప్రధానంగా వేరుశనగ 1.98 లక్షల హెక్టార్లుగా లెక్కగట్టారు. పత్తి, కంది, ఆముదం, మొక్కజొన్న ఇతర ప్రధాన పంటలుగా గుర్తించారు. ఈ క్రమంలో వివిధ రకాల విత్తనాలు రాయితీపై 81,832 క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. 76,710 క్వింటాళ్లు విత్తన వేరుశనగ, 2,300 క్వింటాళ్లు కందులు, 1,600 క్వింటాళ్ల విత్తన వరి, 700 క్వింటాళ్ల ఉలవలు, 200 క్వింటాళ్ల జీలుగ, 25 క్వింటాళ్ల పిల్లిపెసర, 7 క్వింటాళ్ల జనుము, 106 క్వింటాళ్ల అలసంద, 85 క్వింటాళ్ల పెసర, 46 క్వింటాళ్ల మినుము, 50 క్వింటాళ్ల కొర్రలు, నాలుగు క్వింటాళ్ల రాగులు రాయితీతో పంపిణీ చేయనున్నారు. జనుము, జీలుగ, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలపై 50 శాతం రాయితీ వర్తింపజేశారు. జనుము, జీలుగ విత్తనాలకు 50 శాతం రాయితీ పోనూ, క్వింటాకు రూ.4,400 ప్రకారం, పిల్లిపెసరకు రూ.6,700 ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది. వర్షాలు పడుతున్నందున రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. జూన్ మొదటి వారంలోనే నైరుతి రుతుపవనాలు ప్రవేశించనుండగా జూన్ 15 నుంచి జూలై ఆఖరు వరకు పంటల సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు తెలిపారు.

కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్



అనంతపురం అర్బన్: వేరుశనగ విత్తనకాయల పంపిణీ, భారీ వర్షాల నేపథ్యంలో ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. వివరాలను ఆయన గురువారం వెల్లడించారు. విత్తనకాయల పంపిణీ క్రమంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నా, వర్షాల కారణంగా సమస్యలు ఎదురైనా తక్షణం కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫోన్ నంబర్లు

- 18004258802 లేదా 08554- 234122
- 18004258803 లేదా 08554- 239822
- 18004258804 లేదా 08554- 231722

బీటెక్ ఫలితాల విడుదల



అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో మే నెలలో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం జేఎన్‌టీయూ అనంతపురం వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

జిల్లాకు భారీ వర్ష సూచన

- విపత్తులు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- అధికారులకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం
- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘస్వరూప్

అనంతపురం అర్బన్: 'రానున్న మూడు నాలుగు రోజుల్లో జిల్లాకు భారీ వర్ష సూచనలున్నాయి. వాన కారణంగా విపత్తులు సంభవిస్తే ఎదుర్కొనేందుకు అన్ని విధాల సిద్ధంగా ఉండాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు కురవనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, ఏర్పాట్లపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. భారీ వర్షాలు కురిస్తే క్షేత్రస్థాయిలో ఎలా వ్యవహరించాలనే దానిపై అధికారులు తమ పరిధిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల సహాయక చర్యలు అందించేందుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. ఆర్డీఓ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వరి, మొక్కజొన్న పంటలు కోత దశలో ఉన్నందున వాటిని కాపాడేందుకు రైతులతో కలిసి చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువులను పాకల్లోనే ఉంచుకునేలా చూడాలన్నారు. ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ స్తంభాలు పడిపోతే తక్షణం మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని చెప్పారు.భారీ వర్షాల కారణంగా చెరువులకు గండ్లు పడే ప్రమాదం ఉంటుందని,అప్రమత్తంగా ఉంటూ గండ్లు పూడ్చేందుకు అవసరమైన చర్యలను తక్షణం తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గతంలో నీట మునిగిన ప్రాంతాల ప్రజలతో తహసీల్దార్లు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ అధికారులు పోలీసు యంత్రాంగంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. చౌక ధరల దుకాణాలకు రేషన్‌ను 48 గంటల్లో సరఫరా చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థలో ఒక బృందం ఏర్పాటు చేసి అత్యవసర స్పందన వాహనం సిద్ధంగా ఉంచుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. కాలువల్లో పూడికతీత, పడిపోయిన చెట్ల తొలగింపు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, ఆర్‌డీఓలు రాణి సుస్మిత, శ్రీనివాసులురెడ్డి, వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

27 నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్



అనంతపురం/కళ్యాణదుర్గం: పాలీసెట్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 27 నుంచి నిర్వహించనున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి, కౌన్సెలింగ్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. రామకృష్ణా రెడ్డి, కళ్యాణదుర్గం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ శ్రీధర్ కుమార్ తెలిపారు.అనంతపురం,తాడిపత్రి, కళ్యాణదుర్గం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఈ నెల 24 (నేడు) నుంచి జూన్ 2 వరకు appolycet.nic.in వెబ్‌సైట్‌లో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 రుసుం చెల్లించి రసీదును పొందాలన్నారు.

ఆప్షన్ల ఎంపిక...

జూన్ 5 నుంచి ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉంటుంది. కళాశాలలో సీట్ల కేటాయింపు జూన్ 7న జరుగుతుంది. విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకు రావాలి.

విద్యార్థులు తీసుకువాల్సిన పత్రాలు...

- కౌన్సెలింగ్ ఫీజు (ప్రాసెసింగ్ ఫీజు) రసీదు
- ఏపీ పాలీసెట్ హాల్‌టికెట్
- పాలీసెట్ ర్యాంక్ కార్డు
- 10వ తరగతి మార్కుల జాబితా (ఒరిజినల్ లేదా నెట్ కాపీ)
- 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు
- ఓసీ కేటగిరీ వారికి ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్ ఇలా..

ర్యాంకు	తేదీ
1 నుంచి 12 వేలు	27.05.2024
12,001 నుంచి 27 వేలు	28.05.2024
27,001 నుంచి 43 వేలు	29.05.2024
43,001 నుంచి 59 వేలు	30.05.2024
59,001 నుంచి 75 వేలు	31.05.2024
75,001 నుంచి 92 వేలు	01.06.2024
92,001 నుంచి 1,08,000	02.06.2024
1,08,001 నుంచి చివరి ర్యాంకు	03.06.2024

2024-25 ఏడాదికి సంబంధించి..

- ఇన్‌కం సర్టిఫికెట్ (01.01.2021 నుంచి)
- కులం సర్టిఫికెట్
- ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)

కౌంటింగ్ రోజు తాడిపత్రిలో కట్టుదిట్టమైన భద్రత



జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాస ప్రాంతంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమిశాలి

తాడిపత్రి అర్బన్: కౌంటింగ్ సందర్భంగా తాడిపత్రిలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, జిల్లా ఎస్పీ గౌతమి శాలి గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలను పరిశీలించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాస ప్రాంతాలు, జూనియర్ కళాశాల మైదానంతో పాటు ఫ్లై ఓవర్, పుట్లూరు రోడ్డులోని టీడీడీ కల్యాణ మండపం, యల్లనూరు రోడ్డులోని శివాలయం, కడప రోడ్డులోని ఐశ్వర్య విల్లాస్, సజ్జలదిన్నె క్రాస్, చుక్కలూరు క్రాస్, నందలపాడు, పెద్దపప్పూరు రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీలు జనార్దన్‌నాయుడు, శివారెడ్డి, బి.శ్రీనివాసులు, శివభాస్కర్‌రెడ్డితో మాట్లాడుతూ కౌంటింగ్ రోజున అనుమానితులెవ్వరూ పట్టణంలోకి ప్రవేశించకుండా శివార్లలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ముఖ్య నాయకుల ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు నాగేంద్రప్రసాద్, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు గౌస్‌బాషా, సాగర్‌లు ఉన్నారు.

ఒకే రోజు మూడు పరీక్షలు

- నేడు పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ, డీఈఈ సెట్ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా శుక్రవారం మూడు పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతి సప్లిమెంటరీ, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానుండగా, డీఈఈ సెట్ కూడా జరగనుంది. ఇందుకోసం విద్యాశాఖ, ఇంటర్ బోర్డు అధికారులు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. పదో తరగతి పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 45 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 13,332 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష ఉంటుంది. జూన్ 3 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి.

- ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈనెల 30తో ప్రధాన పరీక్షలు ముగుస్తాయి. 31, జూన్ 1 మైనర్ సబ్జెక్టుల పరీక్షలుంటాయి. జిల్లాలో 22,510 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలుంటాయి. పరీక్షల సమయంలో నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లో అనుమతి ఉండదు.
- డీఈఈసెట్-2024 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉంటుంది. మొత్తం 344 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అనంతపురం నగర శివారులోని చిన్మయానగర్ ఎల్ఆర్‌జీ స్కూల్ పక్కన నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషియల్ యాక్షన్ ఇండియా (ఎన్‌సీసీఎస్ఏఐ)ను పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసినట్లు డీఈఓ వరలక్ష్మీ తెలిపారు. అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని ఆమె సూచించారు.



జాజికొండపై ఉన్న నీటి కుంట

కుంట.. ఇంకిపోదంట!

ఏ నీటి వనరులో నిల్వ ఉన్న నీరైనా ఎప్పటికో ఒకసారి ఇంకిపోతుంటుంది. నెలలు కావచ్చు, ఏళ్లు కావచ్చు కానీ నీరు ఖాళీ కావడం మాత్రం ఖాయం. కానీ, పుట్లూరు మండలం చాలవేముల సమీపంలోని జాజికొండపై ఉన్న నీటి కుంటలో మాత్రం నీరు అసలు ఇంకిపోవడమే లేదు. ఎత్తైన కొండపై చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం పక్కనే ఈ కుంట ఉంది. రాతిబండపై సహజ సిద్ధంగా ఏర్పడిన ఈ కుంటలోని నీటి ద్వారా ఆలయానికి వచ్చే భక్తులతో పాటు మూగజీవాలు దప్పిక తీర్చుకుంటున్నాయి. వర్షాభావ పరిస్థితుల్లో సైతం ఈ కొండపై నీరు నిల్వ ఉంటోంది. రాతి బండ కావడం వల్లే నీరు ఏళ్ల తరబడి ఇంకిపోవడం లేదని కొందరు అంటుండగా, చౌడేశ్వరి అమ్మవారి మహిమ వల్లే ఎండిపోవడం లేదని భక్తులు చెబుతున్నారు.

– పుట్లూరు:

ఆన్‌లైన్‌లో మూల్యాంకనం

- సాంకేతికతను అందిపుచ్చుకున్న ఇంటర్ బోర్డు
- సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల ఆన్‌లైన్ ద్వారానే దిద్దనున్న ఎగ్జామినర్లు
- ఇంటర్ బోర్డు చరిత్రలోనే సరికొత్త అధ్యాయానికి తెర
- తరగతుల నిర్వహణకు ఆటంకం, అడ్మిషన్ల సమయంలో ఇబ్బంది ఉండకూడదనే ఈ నిర్ణయం
- ఆన్‌లైన్ మూల్యాంకనం ద్వారా పొరబాట్లకు తావు ఉండదంటున్న అధికారులు



అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం ఆన్‌లైన్ విధానంలో చేపట్టడానికి ఇంటర్ బోర్డు శ్రీకారం చుట్టనుంది. ఈనెల 24 నుంచి జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాలను ఆన్‌లైన్‌లోనే దిద్దనున్నారు. ఇందుకు సంబంధించి కసరత్తు జరుగుతోంది. ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ప్రతి జిల్లాలోనూ మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేసేవారు. వార్షిక పరీక్షలకైతే 20 రోజులు, సప్లిమెటరీ పరీక్షలకైతే 12 రోజుల పాటు మూల్యాంకనం జరిగేది. సప్లిమెంటరీ పరీక్షల తర్వాత చేపట్టే మూల్యాంకనం సరిగ్గా జూన్ 1 నుంచి మొదలవుతుంది. అప్పుడప్పుడే కళాశాలలు పునఃప్రారంభం అవుతాయి. ఈ సమయంలోనే విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతుంటాయి. అయితే అధ్యాపకులందరూ 'స్పాట్' కేంద్రంలో ఉండాల్సి రావడంతో ఓవైపు తరగతుల నిర్వహణకు ఆటంకంతో పాటు మరోవైపు అడ్మిషన్లకు ఇబ్బందిగా మారుతోంది. అదే ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు బాగా చేసుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఈ సమస్యను అధిగమించి అధ్యాపకులందరూ కళాశాలల్లో అందుబాటులో ఉండేందుకే ఈ ఆన్‌లైన్ విధానం తీసుకొచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. దీనికితోడు ఎలాంటి పొరబాట్లకు తావు ఉండదని చెబుతున్నారు. మ్యానువల్‌గా మూల్యాంకనం చేసే సమయంలో మార్కుల టోటలింగ్‌లో పొరబాట్లు, కొన్ని ప్రశ్నలకు మార్కులు మరిచిపోవడం వంటి ఘటనలు జరుగుతున్నాయి. గతంలో ఒక విద్యార్థికి 70 మార్కులు వస్తే టోటల్ మార్కులు వేసే సమయంలో పొరబాటున సున్నా ఎగిరిపోయి 7 మార్కులు మాత్రమే వేశారు. తర్వాత రీ వెరిఫికేషన్‌లో అసలు విషయం బయటపడింది. ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. ఇకపై ఆ పరిస్థితి ఉండదు.

ఒక ప్రశ్న పరిశీలించిన తర్వాతనే రెండో ప్రశ్న డిస్‌ప్లే

ఆన్‌లైన్‌లో మూల్యాంకనం చేసేటప్పుడు మొదటి ప్రశ్న డిస్‌ప్లే వచ్చిన తర్వాత ఎగ్జామినర్ పరిశీలించిన తర్వాతనే రెండో ప్రశ్న వస్తుంది. ఇలా ప్రతిప్రశ్న తప్పనిసరిగా పరిశీలించిన తర్వాతనే ఫైనల్ సబ్‌మిట్ చూపిస్తుంది. విద్యార్థి జవాబు రాసినా, రాయకపోయినా అన్ని ప్రశ్నలూ పరిశీలించాల్సి ఉంటుంది. దీనిద్వారా ఏ ఒక్క ప్రశ్న మరిచిపోయే అవకాశం ఉండదు. మార్కుల విషయంలో ఒక ప్రశ్నకు మ్యాగ్జిమం వేయాల్సిన మార్కులంటే ఎక్కువ వేసినా తీసుకోదు.

తరగతులకు ఆటంకం కలగకూడదు

ఆన్‌లైన్‌లో పేపర్లు దిద్దే ఎగ్జామినర్లు ఎట్టి పరిస్థితుల్లో కళాశాలల్లో విద్యార్థుల తరగతలకు ఆటంకం కలిగించకూడదు. ఉదయం 8 గంటలలోపు, తర్వాత కళాశాల నుంచి వచ్చిన తర్వాత మూల్యాంకనం చేసుకోవచ్చు. కళాశాలలో పీరియడ్లు లేని సమయంలోనూ చేసుకోవచ్చు. ప్రతి ఎగ్జామినరూ 'టీక్యూఐడీ' ద్వారా లాగిన్ అయి వెంటనే పాస్‌వర్డ్ మార్చుకోవాలి. తర్వాత వెబ్‌కెమెరా ముందు తన ఫొటో క్యాప్చర్ చేసి లాగిన్ అవుతారు. ముందుగా ఐదు ప్రాక్టీస్ పేపర్లు మూల్యాంకనం చేసిన తర్వాత రెగ్యులర్ పేపర్లు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో ఎగ్జామినగర్‌కు రోజుకు గరిష్టంగా 50 జవాబుపత్రాలు అందుబాటులో ఉంటాయి.

డీఆర్డీసీ స్థానాల్లో ఆర్ఆర్ఎస్‌సీలు

మ్యానువల్ మూల్యాంకనం సమయంలో ప్రతి జిల్లాలోనూ డీఆర్డీసీ జిల్లా రీకలెక్షన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఉండేది. దీనిద్వారా జిల్లాలోని అన్ని జవాబుపత్రాలను కలెక్షన్ చేసి ఎంపిక చేసిన జిల్లాలకు పంపేవారు. ఇప్పుడు రీజనల్ రెసెప్షన్ స్కానింగ్ సెంటర్ (ఆర్ఆర్ఎస్సీ)లు అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు ముగిసిన తర్వాత స్పీడ్ పోస్ట్ ద్వారా ఎంపిక చేసిన ఆర్ఆర్ఎస్‌సీలకు జవాబుపత్రాలు పోతాయి. అక్కడ ఆన్‌లైన్‌లో నమోదు చేసి మూల్యాంకనానికి చర్యలు తీసుకుంటారు.

సప్లిమెంటరీ నుంచి ఆన్‌లైన్‌లోనే 'స్పాట్'



సప్లిమెంటరీ జవాబుపత్రాలను ఆన్‌లైన్ ద్వారానే మూల్యాంకనం చేయాల్సి ఉంది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు అందాయి. ఈ ఆన్‌లైన్ విధానంపై అవవగాహన కల్పించేందుకు నేడు (బుధవారం) ఉదయం 11.30 గంటలకు అనంతపురం కొత్తూరు ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశాం. అన్ని యాజమాన్యాల కళాశాలల నుంచి ఒక్కో అధ్యాపకుడు ఖచ్చితంగా హాజరుకావాలి. వర్చువల్ విధానంలో బోర్డు అధికారులు అవగాహన కల్పిస్తారు.

– ఎం. వెంకటరమణనాయక్, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఇంటర్ బోర్డు

సేవాలాల్ ఆలయంలో 'మహాభోగ్'



మహా భోగ్ నిర్వహిస్తున్న అర్చకులు

గుత్తి రూరల్: దేశంలోని 15 కోట్ల బంజారాలు తమదైన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరించకుండా కాపాడుకోవాలని బంజారా సేవా కల్చర్ ఆర్గనైజర్ ఎస్‌కే రామచంద్ర నాయక్ పిలుపునిచ్చారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని గుత్తి మండలం సేవాగఢ్‌లో సేవాలాల్ మహారాజ్ ఆలయంలో గురువారం భక్తి శ్రద్ధలతో మహాభోగ్ కార్యక్రమం నిర్వహించారు. అర్చకుడు మారుతీప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సేవా కల్చర్ ఆర్గనైజర్ రామచంద్ర నాయక్, సభ్యులు సుబ్రహ్మణ్యం నాయక్, రూపా నాయక్ మాట్లాడుతూ... దేశంలోని బంజారాలు ఏకతాటిపైకి వచ్చి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ భక్తి మార్గంలో నడవాలన్నారు. క్రాంతికారి సేవాలాల్ మహారాజ్ ధర్మ బోధనలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆదర్శవంతమైన కట్టుబాట్లు, వివాహ శుభకార్యాలు, ఇతర వేడుకలను బంజారా సంప్రదాయ రీతిలో మాత్రమే జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహారాష్ట్రకు చెందిన క్రాంతి చౌహాన్, రమేష్ రాథోడ్, బాలాజీ నాయక్, వెంకటరమణనాయక్, గోవిందమ్మ పాల్గొన్నారు.

గుత్తి కోట అద్భుతం

- సందర్శించిన హైకోర్టు ప్రభుత్వ ప్లీడర్



గుత్తి కోటను సందర్శించిన హైకోర్టు స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్ కాసా జగన్‌మోహన్‌రెడ్డి

గుత్తి: గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందని రాష్ట్ర హైకోర్టు స్పెషల్ గవర్నమెంట్ ప్లీడర్ కాసా జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గుత్తి కోటను గురువారం ఆయన సందర్శించారు. కోటలోని ఏనుగు, గుర్రపు శాలలు, చీకటి గదులు, రంగ మంటపం, బావులు, ఆలయాలు తదితర చారిత్రక కట్టడాలను వీక్షించారు. గైడ్ రమేష్ ఆయనకు కోట ప్రాముఖ్యతను వివరించారు. కాసా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... కోటలోని కట్టడాలు చాలా బాగున్నాయన్నారు. మరోసారి కుటుంబసభ్యులతో కలసి గుత్తి కోట సందర్శనకు వస్తానన్నారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, హైకోర్టు న్యాయవాది శ్రీధర్, టీచర్ రఘురాం పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

గుత్తి: పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. కూరగాయల మార్కెట్ కాలనీలో ఆరు బయట నిద్రిస్తున్న ఎనిమిది మందిని కరిచి తీవ్రంగా గాయపరిచింది. గాయపడిన వారిలో వెంకట్రాముడు, నారమ్మ, ఇర్ఫాన్, పవన్, బాషా, సాదిక్‌తో పాటు మరో ఇద్దరు ఉన్నారు. క్షతగాత్రులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందారు. ముఖంపై తీవ్ర గాయాలైన వెంకట్రాముడు, నారమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. కాగా, వీధిలో సంచరిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసిన పిచ్చికుక్కను కొందరు యువకులు కర్రలతో మోది చంపేశారు.

క్లుప్తంగా

వాహనం ఢీ... యువకుడి మృతి



చంద్రమోహన్ (ఫైల్)

ఆత్మకూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... ఆత్మకూరు మండలం తలుపూరుకు చెందిన చంద్రమోహన్ (28)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నాలుగేళ్లుగా గుంతకల్లులో వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేసే పనితో జీవనం సాగిస్తున్న ఆయన ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. బుధవారం రాత్రి ఆత్మకూరులో పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై తలుపూరుకు బయలుదేరాడు. వడ్డుపల్లి అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా వెళ్లిపోయాడు. అటుగా వెళుతున్న వారు గుర్తించి టోల్‌ప్లాజా వద్ద ఉన్న అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్: స్థానిక హంపయ్య కాలనీకి చెందిన షేక్ అమీనాబేగం ఇంట్లో చోరీ జరిగింది. నకిలీ తాళం చెవిని వినియోగించి దుండగులు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో భద్రపరిచిన 2.5 తులాల బంగారు నగలు, 50 తులాల వెండి సామగ్రి, కొంత నగదు అపహరించుకెళ్లారు. బుధవారం రాత్రి అమీనాబీ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి స్థానిక మస్తాన్‌వలి దర్గాలో నిద్ర చేయడానికి వెళ్లారు. తిరిగి గురువారం ఉదయాన్నే ఇంటికి చేరుకుని చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని పోలీసులకు సమాచారమందించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తుచేపట్టినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

కట్టెతో తలపై మోది... కాలుతో గొంతు తొక్కి!

- వేధింపులు తాళలేక భర్తను హతమార్చిన భార్య



శ్రీనివాసులు (ఫైల్)

గుంతకల్లు రూరల్: మద్యానికి బానిసై కుటుంబసభ్యులను వేధింపులకు గురిచేస్తున్న జులాయి భర్తను కట్టుకున్న ఇల్లాలే హతమార్చింది. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడుకు చెందిన శ్రీనివాసులు (52)కు కొన్నేళ్ల క్రితం గుంతకల్లుకు చెందిన సరస్వతితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితం కుటుంబంతో కలసి గుంతకల్లుకు వలస వచ్చిన శ్రీనివాసులు స్థానికంగా తోపుడు బండిపై పండ్లను అమ్ముతూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆ తర్వాత వ్యాపారం మానేసి రాప్తాడుకు వెళ్లి పొలం పనులు చూసుకుని వచ్చేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసై జులాయిగా మారాడు. రోజూ మద్యం మత్తులో ఇంటికి చేరుకుని భార్యాపిల్లలను వేధించేవాడు. అతని వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో భార్యాపిల్లలు విసుగెత్తిపోయారు. బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న భర్త కుటుంబసభ్యులను నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ భౌతికదాడికి తెగబడ్డాడు. దీంతో భార్య సరస్వతి తనకు అందుబాటులో ఉన్న కర్ర తీసుకుని భర్త తలపై మోదింది. కిందపడిన భర్త గొంతుపై కాలు వేసి తొక్కి పట్టింది. కాసేపటి తర్వాత భర్త మరణించాడని నిర్ధారించుకున్న తర్వాత సహజ మృతిగానే వీధిలోని వారందరినీ నమ్మించి, గురువారం ఉదయాన్నే అంత్యక్రియలకు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేసింది. మృతుడు శ్రీనివాసులు తలపై ఉన్న దెబ్బ, గొంతుపై నల్లగా ఉన్న గుర్తును చూసిన తండ్రి ఆంజనేయులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ సురేష్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రాథమిక విచారణలో భర్త వేధింపులు తాళలేక భార్యనే హతమార్చినట్లు నిర్ధారించుకుని ఆ దిశగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్య

జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఒకే రోజు ముగ్గురు బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో ఇద్దరు అనంతపురం శివారులో, మరొకరు తాడిపత్రిలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు.



సాంబశివారెడ్డి (ఫైల్)

అనంతపురం సిటీ/తాడిపత్రి: స్థానిక 44వ జాతీయ రహదారి సమీపంలోని నేషనల్ పార్క్ సమీపంలో రైలు కింద పడి అనంతపురంలోని తపోవనం ప్రాంతానికి చెందిన పోరెడ్డి సాంబశివారెడ్డి(44) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బైక్‌పై బయలుదేరిన ఆయన పట్టాల పక్కన తన ద్విచక్ర వాహనాన్ని ఆపి రైలు కింద పడి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

- గార్లదిన్నె–తాటిచెర్ల మధ్య బుధవారం అర్ధరాత్రి రైలు కింద పడి శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన వడ్డే రాజు(26) ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడని, ఈ క్రమంలోనే తాగుడుకు బానిసైనట్లుగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కుటుంబ పోషణ పట్టించుకోకుండా తరచూ కుటుంబసభ్యులతో గొడవపడేవాడని, ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. మృతుడికి భార్య శ్రీవాణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ రెండు ఘటనలపై జీఆర్‌పీ ఎస్‌ఐ విజయకుమార్ కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.
- తాడిపత్రికి చెందిన టౌన్ బ్యాంక్ విశ్రాంత మేనేజర్ దద్దం శ్రీనివాసరావు (62) బుధవారం అర్ధరాత్రి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. గతంలో చెన్నైలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ఆయనకు కాళ్లు విరిగాయి. కోలుకునేందుకు చాలా కాలం పట్టింది. పూర్తి స్థాయిలో ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మానసికంగా కుదేలయ్యారు. ఈ క్రమంలో కర్నూలులోని ఓ సైక్రియాటిస్ట్ వద్ద కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి పెంచుకున్న ఆయన బుధవారం రాత్రి ఆటో నగర్ సమీపంలోని పట్టాలపై చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య విజయలక్ష్మి ఉన్నారు. ఈ ఘటనపై జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు అమలు

అనంతపురం: జిల్లా బహిష్కరణకు గురైన 8 మందికి పోలీసులు నోటీసులు అందజేసి గురువారం జిల్లా సరిహద్దులు దాటించారు. మట్కాను కొనసాగిస్తున్న నలుగురితోపాటు ఇతర రాష్ట్రాల మద్యం విక్రయాలకు సంబంధించి ఇద్దరు, ఎన్నికల నేపథ్యంలో ప్రజల్ని భయాందోళనలకు గురిచేస్తున్న మరో ఇద్దరిపై జిల్లా బహిష్కరణ వేటు పడిన విషయం తెలిసిందే. జిల్లా ఎస్పీ గౌతమి శాలి సిఫార్సు మేరకు వారిని జిల్లా నుంచి బహిష్కరిస్తూ కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ముగ్గురిని జూలై 15వ తేదీ వరకూ బహిష్కరించగా, మిగిలిన ఐదుగురిపై మూడు నెలల పాటు ఆంక్షలు విధించారు. జిల్లా బహిష్కరణకు గురైన వారిలో అనంతపురంలోని రాణీనగర్‌కు చెందిన కడపల వెంకట్రాముడు అలియాస్ వెంకటరమణ/కోడి వెంకట్రాముడు, బుడ్డప్పనగర్‌కు చెందిన షికారి భగవాన్, వేణుగోపాలనగర్‌లోని తారకరామాపురం కొట్టాలకు చెందిన చాకలి చలపతి అలియాస్ మీసాల చలపతి, గుంతకల్లులోని శాంతినగర్‌లో నివాసముంటున్న జి.మాబు అలియాస్ గాడి మాబు, గార్లదిన్నె నివాసి దూదేకుల అబ్దుల్ అలియాస్ అబ్దుల్లా, బెళుగుప్ప మండలం గంగవరం గ్రామానికి చెందిన అంకె నారాయణ అలియాస్ అంకె నారాయణస్వామి, కంబదూరులోని గుండ్లపల్లి కాలనీలోకి చెందిన ఎరికల ముత్యాలన్న అలియాస్ ముత్యాలప్ప/జోల్లోడు, ఎరికల శేఖర్ అలియాస్ ఎరికల రాజశేఖర్/గూండబండ ఉన్నారు.

ఉపాధి కల్పనలో నిర్లక్ష్యం వీడండి

- జెడ్పీ సీఈఓ నిదియాదేవి

కూడేరు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా గ్రామీణ ప్రాంత కూలీలకు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వీడాలని సంబంధిత సిబ్బందికి జెడ్పీ సీఈఓ నిదియాదేవి సూచించారు. కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనుల కల్పనపై సంబంధిత అధికారులతో గురువారం రాత్రి ఆమె సమీక్షించారు. ఉపాధి కల్పనే ధ్యేయంగా పని చేయాలన్నారు. ఉపాధి కూలీలతో గ్రామ సభలు నిర్వహించి ఏఏ ప్రాంతాల్లో ఏ రకం పనులు గుర్తించింది వివరించాలన్నారు. రోజుకు 4 వేల మందికి ఉపాధి పనులు కల్పించేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు డ్రైల్యాండ్ హార్టికల్చర్ కింద మొక్కలు నాటే కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఫారం పాండ్ల ఆవశ్యకతను రైతులకు వివరించి తవ్వాకాలకు సన్నద్ధం చేయాలన్నారు. అన్ని పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచాలని, ఈ విషయంగా నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీడీ విజయలక్ష్మి, ఎంపీడీఓ ముస్తఫా కమల్‌బాషా, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డి, ఏపీఓ తులసీప్రసాద్, ఇంజనీర్ రవి, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల విక్రయం - పాఠశాల గది సీజ్



పుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ఓ స్కూల్‌లో పుస్తకాలు విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మకాలు చేస్తున్నట్లు గుర్తించి పాఠశాలలోని రికార్డు గదిని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమావేశం ఏర్పాటు చేసుకుని ఆదేశాలు జారీ చేసినా కొందరు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటున్నారని మండిపడ్డారు. జూన్ 12 వరకు ఎవరూ పాఠశాలలు నిర్వహించకూడదని నిర్దిష్టమైన ఆదేశాలున్నాయన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ... విద్య హక్కు చట్టానికి విరుద్ధంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తరగతులు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. ముందస్తు అడ్మిషన్లు చేపట్టి, పాఠశాల పేరుతో ముద్రించిన పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి మంజు ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు భీమేష్, వంశీ, సిద్దు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో చీనీచెట్ల నరికివేత



పెద్దపప్పూరు: సమస్యాత్మక గ్రామంగా గుర్తించిన పెద్దపప్పూరు మండలంలోని రెడ్డిపల్లిలో కక్షలకు ఆజ్యం పోస్తూ చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికి వేశారు. వివరాలు... గ్రామానికి చెందిన మహిళా రైతు వెంకటలక్ష్మి తనకున్న రెండు ఎకరాల పొలంలో 250 చీనీ చెట్లను సాగు చేశారు. గురువారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి చొరబడి దాదాపు 189 చెట్లను నరికివేశారు. తెల్లవారిన తర్వాత అటుగా వెళ్లిన రైతులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైతు వెంకటలక్ష్మి, కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సైతం అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. చెట్ల నరికవేతకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు బాధిత రైతు వెంకటలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ శరత్‌చంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

శేష వాహనంపై శ్రీవారు

రాయదుర్గంటౌన్: స్థానిక కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం దేవేరులతో కలసి శేషవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు పెద్ద ఎత్తున జరిగాయి. సాయంత్రం కుర్నిశెట్టి సంఘం ఆధ్వర్యంలో మేళతాళాలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటరమణ స్వామి ఉత్సవ మూర్తులను శేషవాహనంపై అధిష్టింపజేసి కోట, మొలకాల్మూరు రోడ్డు, వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, బొడ్డురాయి వరకూ ఊరేగించారు. అనంతరం ఆలయానికి చేర్చారు. శుక్రవారం హనుమద్ వాహన సేవలు ఉంటాయని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ పాలాక్షిరెడ్డి, సభ్యులు రేకులకుంట సత్యనారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.

25న శ్రీవారి కల్యాణోత్సవం

ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 25వ తేదీ శనివారం విశిష్ట సంప్రదాయంలో ప్రసన్న వేంకటరమణుడి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవాదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 11.30 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవం ఉంటుందన్నారు.



శేష వాహనంపై ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

నేటి నుంచి సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ


ఆత్మకూరులో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఓ సుచరిత

ఆత్మకూరు: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసేందుకు సబ్సిడీ విత్తన వేరుశనగను శుక్రవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుచరిత తెలిపారు. గురువారం మండల వ్యాప్తంగా ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగకు రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఒక పాస్ పుస్తకానికి 30 కిలోల బస్తాలు మూడు ఇవ్వడం జరుగుతుందన్నారు. సబ్సిడీ పోనూ ఒక బస్తాకు రూ.1,710 చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేరుశనగ కావాల్సిన రైతులు తమ గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకే విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న సమ్మర్ క్యాంప్


యోగాపై శిక్షణ ఇస్తున్న సుబ్బరాయుడు

కనగానపల్లి: వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్)లో భాగంగా విద్యార్థులకు ఆటలు, యోగాలో శిక్షణ అందిస్తున్నట్లు మండల గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో యోగా విద్యపై విద్యార్థులకు యోగా గురువు సుబ్బరాయుడు శిక్షణ అందించారు. యోగాసనాలు వేయటం ద్వారా ఆరోగ్యం, శారీర ధారుఢ్యత పెరుగుతుందన్నారు. అలాగే చెస్, క్యారమ్స్, స్కిప్పింగ్ వంటి ఆటలపై శిక్షణ అందించారు. వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా సమ్మర్ క్యాంపులకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజు ప్రశాంతంగా ఉండాలి

రాప్తాడురూరల్: సాధారణ ఎన్నికల కౌంటింగ్ జరిగే జూన్ 4న గ్రామాల్లో అందరూ ప్రశాంతంగా ఉండాలని రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం రూరల్ మండల పరిధిలోని ఆలమూరు, ముండబండపల్లి గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఏ పార్టీ గెలిచినా ప్రజలంతా సంయమనం పాటించాలన్నారు. ఏమాత్రం గొడవలకు అవకాశం ఇచ్చినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాలీలపై నిషేధం ఉందన్నారు. అలాగే టపాసులు కాల్చకూడదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందని.. నలుగురు గుమికూడినా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా బైకులకు సైలెన్సర్లు తీసేసి తిప్పినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కవాతు కూడా చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే తాటిచెర్ల, సోములదొడ్డి, పాములరాయి, సిండికేట్‌నగర్, ఆర్ఎన్ఆర్ కాలనీల్లో కవాతు పూర్తయిందన్నారు. ఎవరి ఇళ్లల్లో వారు కూర్చుని టీవీల ద్వారా ఫలితాలు వీక్షించాలన్నారు. రోడ్లపైకి వచ్చి శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే మాత్రం చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.

అక్క దేవతల ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో అక్క దేవతలు

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన అక్క దేవతల ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా 24వ తేదీన పూపండుకు పోవుట, 26వ తేదీన చెరకు తీసుకొచ్చేందుకు వెళ్లుట, 27వ తేదీన సాయంత్రం చెరకు తెచ్చి రాత్రి జల్దికి వెళ్లే కార్యక్రమం జరుగుతుంది. 28వ తేదీన ఉదయం జల్దిపూజ, సాయంత్రం ఆలయానికి చేర్చుట, 29వ తేదీన పన్నేరపు బండ్ల ప్రదర్శన, పరుష ఉత్సవాలు, 30వ తేదీన అమ్మవారికి పసుపు, కుంకుమ ఇచ్చి కుంకాలాడుటతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 20వ తేదీనే స్వామి వారి ఆలయంలో ముడుపు కట్టారు. చాలా మంది భక్తులు ఆత్మకూరులో ముడుపు కట్టిన రోజు నుంచే మాంసాహారాలు మానేస్తారు. నెల పూజ ముగిసే వరకు గ్రామంలో మాంసాహారాలు తినకుండా అమ్మవారికి పూజలు చేస్తారు. ఆత్మకూరు ప్రజలందరూ కలసిమెలిసి సంతోషంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు.


అనంతపురంలోని వేణుగోపాల నగర్‌లో డివైడర్‌పై విరబూసిన పూలు


సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద నెలకొన్న పచ్చదనం


జేఎన్‌టీయూ- భైరవనగర్ మార్గంలో ఆహ్లాదకరమైన వాతావరణం

తొలకరి పలకరింత..

ప్రకృతి పులకరింత

తొలకరి వర్షంతో ప్రకృతి పులకరించింది. ఇంత కాలం భారీ ఎండల కారణంగా నీరసించిన చెట్లు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. వికసించిన రంగురంగుల పుష్పాలు వెదజల్లే పరిమళం అటుగా వెళుతున్న వారిని పలకరిస్తున్నాయి. మేమున్నాం.. మా సోయగాల్ని ఓ సారి చూడండి అంటూ స్వాగతం పలుకుతున్నాయి.
గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనంతపురం నగరంలోని రోడ్డు డివైడర్లు సరికొత్త అందాల్ని సంతరించుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ఘనంగా బుద్ధ జయంతి


బుద్ధుడి విగ్రహానికి నివాళులర్పించిన మహాబోధి సభ్యులు

అనంతపురం కల్చరల్: జగతికి జ్ఞాన రేఖలను ప్రసరింపజేసిన బుద్ధ జయంతిని గురువారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లాలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా బుద్ధ విహార్ పార్కులో ఉన్న బుద్ధుని విగ్రహం వద్ద బుద్ధ పౌర్ణమి వేడుకలు మహాబోధి సాహితీ వేదిక అధ్యక్షుడు మహాబోధి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగాయి. అతిథులుగా విచ్చేసిన కెనరా బ్యాంకు మేనేజర్ బాలకొండన్న మాట్లాడుతూ.. బుద్ధు ప్రబోధాలైన త్రికరణాలు, అష్టాంగ మార్గాలు, పంచశీల విశిష్టతలను వివరించారు. అలాగే బుద్ధ వందనంతో ప్రారంభమైన కార్యక్రమంలో ఎస్కేయూ ఆనందరాజు ధ్యానం ప్రాముఖ్యతపై మాట్లాడారు. నగరపాలక సంస్థ ఏడీ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ.. బౌద్ధం సమాజానికి ప్రేమ, కరుణ, విశ్వశాంతి గురించి ఆచరణాత్మకంగా తెలియజేసిందన్నారు. అనంతరం వారు బుద్ధపౌర్ణమికి గుర్తుగా పలుచోట్ల మొక్కలు నాటారు. అంతకు ముందు పలువురు బౌద్ధ కుటంబీకులు బుద్ధ విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి జ్ఞానజ్యోతులు వెలిగించారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ పార్క్ ప్రధాన కార్యదర్శి మిద్దె రవీంద్ర, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు శంకర్, నారాయణ స్వామి, తిప్పారెడ్డి, రాఘవేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజ రుగ్మతలను ఎత్తిచూపిన ‘వరదహస్తం’


వరదహస్తం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: అనంత రచయిత్రి పంకజమ్మ రచించిన వరదహస్తం పుస్తకం సమాజంలోని అనేక రుగ్మతలకు పరిష్కారమార్గాన్ని సూచించిందని పలువురు వక్తలు అన్నారు. గురువారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో స్పందన అనంత కవుల వేదిక ఆధ్వర్యంలో వరదహస్తం కథల సంపుటి పుస్తకావిష్కరణ జరిగింది. సంస్థ ప్రధాన కార్యదర్శి చం.శాస్త్రి, పుస్తకావిష్కరణ చేసిన సీనియర్ రచయిత్రి జి.నిర్మలారాణి, విశిష్ట అతిథిగా పాల్గొన్న డాక్టర్ కోడూరి విష్ణునందన్, రాజారామ్ తదితరులు మాట్లాడారు. వరదహస్తం కథల్లో మధ్యతరగతి జీవితంలో మనుషుల తీరుతెన్నులు, సమాజ పోకడలను అద్భుతంగా ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఆరోగ్యవంతమైన కథలను మరోసారి పాఠకులు ఆస్వాదించవచ్చన్నారు. ప్రతి కథ మంచి పెంచుతూ నైతికతను పెంపొందించేలా ఉండటం అభినందనీయమన్నారు. అలాగే పుస్తకాన్ని సమీక్షించిన రచయిత్రులు పేరిందేవి, యమునారాణి మాట్లాడుతూ.. కథల సంపుటిని అందరూ చదవాలన్నారు. తెలుగు వెలుగు సాహిత్య వేదిక సహకారంతో సాగిన పుస్తకావిష్కరణలో సీనియర్ కవులు తరిమెల అమరనాథరెడ్డి, జెట్టీ జైరామ్, శ్రీదేవి, డాక్టర్ జూటూరు షరీఫ్, టీవీరెడ్డి, పండిట్ రియాజుద్దీన్, నానీల నాగేంద్ర, నబీరసూల్, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి, డాక్టర్ పి.శ్రీదేవి, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

బాణాసంచా అమ్మితే చర్యలు

చెన్నేకొత్తపల్లి: జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని చెన్నేకొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ప్రజలకు సూచించారు. మండల పరిధిలో ఎక్కడా టపాసులు ఇతర పేలుడు సామగ్రి విక్రయించొద్దని వ్యాపారులను హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు జూన్ నెల 6వ తేదీ వరకు అమలులో ఉంటాయన్నారు. మందుగుండు సామగ్రి అమ్మకం కొనుగోలు, వినియోగం నిషేధ ఉత్తర్వులను కలెక్టర్ జారీ చేశారన్నారు.

స్కిజో ఫ్రీనియాను ప్రారంభంలోనే గుర్తించాలి

అనంతపురం మెడికల్: దీర్ఘకాలిక మానసిక సమస్య స్కిజో ఫ్రీనియాను ప్రారంభ దశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందిస్తే సత్ఫలితాలు ఉంటాయి. లేని పక్షంలో సమస్య తీవ్రరూపం దాల్చి రోడ్లపై కాగితాలు ఏరుకుంటూ.. గట్టిగా అరుచుకుంటూ తదితర సమస్యలతో బాధపడే పరిస్థితులుంటాయని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 24న ప్రపంచ స్కిజో ఫ్రీనియా దినోత్సవం సందర్భంగా గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సమస్య ఉన్న వారు లేనిది ఉన్నట్లుగా భ్రమించుకుని వింతగా ప్రవర్తిస్తారన్నారు. వంశపారంపర్యం, పెరిగిన వాతావరణం, చిన్న వయస్సులో ప్రతికూలా పరిస్థితులను ఎదుర్కొనుట, చిన్న వయస్సులో లైంగిక, భౌతిక దాడులకు గురవుట, గర్భస్థ సమయంలో తల్లికి వైరల్ జ్వరాలు, మానసిక ఒత్తిడి, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందన్నారు. 18-25 ఏళ్లు, 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి స్కిజో ఫ్రీనియా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇటువంటి లక్షణాలు కన్పిస్తే మానసిక వైద్యులను సంప్రదించి, చికిత్స తీసుకుంటే సరిపోతుందన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు.

గొడవలు వద్దు.. ఐక్యతే ముద్దు


గ్రామస్తులకు సూచనలిస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: ప్రజలందరూ గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంతంగా జీవనం సాగించాలని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం ముష్టికోవెల గ్రామంలో ఏపీఎస్పీ సిబ్బందితో కలసి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అనుమానితుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. అలాగే వారి ఇళ్ల పరిసర ప్రాంతాలను పరిశీలించి హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామంలో అనవసరంగా గొడవలకు దిగితే ఉపేక్షించేది లేదన్నారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడుతాయన్నారు. ఆ రోజు గ్రామంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రజలు సహకరించాలని సూచించారు. గొడవలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. గ్రామంలో ప్రశాంతంగా ఉండాలని ప్రజలకు సూచించారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పలు వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రికార్డులు సరిగా లేని నాలుగు వాహనాలను సీజ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో వైశాఖ పౌర్ణమి


సత్యనారాయణ స్వామి వ్రతం చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: వైశాఖ పౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. హైందవ దేవాలయాల్లో సామూహిక సత్యదేవుడి వ్రతాలు, గురుద్వారాలో సిక్కులు వైశాఖ పౌర్ణమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయంలో రమాసమేత సత్యనారాయణ స్వామి ఆలయం, నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమం, శివకోటి, మూడవ రోడ్డులోని షిర్డీసాయి మందిరం, మొదటి రోడ్డులోని రాఘవేంద్ర స్వామి మఠం తదితర చోట్ల సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా జరిగాయి. అదేవిధంగా స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథ స్వామి ఆలయంలో జరిగిన ఐశ్వర్యేశ్వర వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకుడు బసవరాజ స్వామి భక్తులతో సామూహిక వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కులాల పేరుతో దుష్ప్రచారం చేస్తున్నారు

అనంతపురం ఎడ్యుకేషన్: కులాల పేరుతో తమపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారంటూ సమగ్రశిక్ష ఏపీఓ నారాయణ స్వామి, డీసీఈబీ ఉద్యోగి ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం డీఈఓ వరలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాము ఇద్దరమూ స్నేహపూర్వకంగానే విధులు నిర్వర్తిస్తున్నామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే విధులు చేపడుతున్నామన్నారు. కొన్నేళ్లుగా విద్యాశాఖలో నిబద్ధతతో పని చేస్తున్నట్లు తెలిపారు. తామిద్దరం గొడవ పడినట్లు ఎవరికీ ఫిర్యాదు చేయలేదన్నారు. కావాలనే కొందరు కులాలను ఆపాదిస్తూ చేస్తున్న దుష్ప్రచారాలకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ పేర్లు వాడుకుని కొందరు ప్రచారం చేస్తున్నారని వాపోయారు. అనంతరం వారు రాతపూర్వకంగా డీఈఓకు ఫిర్యాదు చేశారు. భవిష్యత్తులో ఇదేవిధంగా తప్పుడు ప్రచారాలు చేస్తేమాత్రం పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రమాదకరంగా చెట్టు


ధర్మవరం వెళ్లే రహదారిలో పూర్తిగా ఎండిన వేపచెట్టు

చెన్నేకొత్తపల్లి: ఎన్.ఎస్ గేట్ నుంచి ధర్మవరానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉప్పరవాండ్ల కొట్టాల బస్టాండ్ వద్ద ఓ వేప చెట్టు పూర్తిగా ఎండింది. ఈదురు గాలులు బలంగా వీచినప్పుడు పెద్ద కొమ్మలు విరిగి పడే అవకాశం ఉంది. ఈ రహదారిలో రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రమాదం జరగక ముందే ఎండిన చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


ఈఈ రమేష్‌కు సమస్యలను వివరిస్తున్న నాయకులు

అనంతపురం టౌన్: నగరంలో గాలీవానకు పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న విద్యుత్ లైన్లను నేటికి మరమ్మత్తులు చేయలేదని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. గురువారం నగరంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ శాఖ ఈఈ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలోని డీ3, డీ5 విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని పెద్ద ఎత్తున విద్యుత్ స్తంభాలు నేలకులాయన్నారు. దీంతో విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులకు ఫోన్‌లో సమస్యలను విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దీంతో రెండు రోజులుగా పలు ప్రాంతాల్లోని ప్రజలు అంధకారంలోనే ఉండిపోయారన్నారు. కొందరు విద్యుత్ అధికారులు వినియోగదారులతో దురుసుగా వ్యవహరిస్తున్నారన్నారు. అధికార యంత్రాంగం స్పందించి విద్యుత్ మరమ్మత్తుల పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వలి, మసూద్, ప్రసాద్, శ్రీనివాసులు, గఫూర్, ఇస్మాయల్ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా నాటక రంగానికి కీర్తితెచ్చిన గాజుల వెంకట సుబ్బయ్య
- పలు జాతీయ అవార్డులు కైవసం

అనంత నట విభూషణుడు

అనంతపురం కల్చరల్:

ధారుణి రాజ్య సంపద మదమ్మున
కోమలి క్రిష్ణజూచి..
రంభోరు నిజోరు దేశమునుండగ బిల్చిన
ఇద్దురాత్ము,
దుర్వార మదీయ బాహుబరి వర్జిత చండ
గాధా భిఘాత..
భగ్నోరు తరోరు జేయుదు సుయోధనన్
ఉగ్రరణాంతరంబునన్..’

భీముడి వేషంలో ఈ పద్యం ఆవేశంగా చెబుతుంటే ప్రేక్షకులు కేరింతలు కొడుతూ కరతాళధ్వనులు చేస్తూ ఆడిటోరియాన్ని వన్స్‌మోర్ అంటూ మార్మోగిస్తారు. ఇంత అద్భుతంగా పద్యాన్ని ఆలపించిన నటుడు ఎవరని తెలుసుకుని మరీ అభినందిస్తారు. ఏడు పదుల వయస్సు దాటినా నాటక రంగంపై మక్కువతో పౌరాణిక పాత్రలతో ప్రశంసలందుకుంటున్న నట గాయకుడు గాజుల వెంకట సుబ్బయ్య జీవితం మొత్తం రంగస్థలంతో ముడిపడిపోయింది. తొమ్మిదేళ్ల వయస్సు నుంచే అనంత నాటక రంగంపై మక్కువ పెంచుకున్న ఆయన పలు జాతీయ అవార్డులు కైవసం చేసుకున్నారు. నటుడిగా, కవిగా, పద్యగాయకుడిగా ప్రపంచ రికార్డు కోసం అవిరళ కృషి చేస్తున్న వెంకట సుబ్బయ్య నాటకరంగంతో అనుబంధాన్ని ‘సాక్షి’తో పంచుకున్నారు. ఆ విశేషాలను ఆయన మాటల్లోనే విందాం..


గాజుల వెంకటసుబ్బయ్యను సన్మానిస్తున్న దృశ్యం


నాటకంలో ఓ పాత్రను పోషించిన వెంకట సుబ్బయ్య

సొంతూరు సుబ్బరాయుని పల్లె..
మాది సీకే పల్లి మండలం సుబ్బరాయుని పల్లె. అమ్మ లక్ష్మమ్మ, నాన్న కోణయ్య ఇద్దరూ వ్యవసాయదారులే. ఎలా అబ్బిందో కానీ నాకు చిన్నప్పటి నుంచే నాటకాలంటే ఎంతో ఇష్టముండేది. అలా నా తొమ్మిదేళ్ల వయస్సులోనే రామాంజనేయ యుద్ధం నాటకంలో నారద పాత్రతో నా నట జీవితం ఆరంభమైంది. చదువుకునే రోజుల్లోనే అప్పటి డీఈఓ విశాలాక్షి నటనను మెచ్చుకొని అవార్డు అందించారు. అదే స్ఫూర్తితో ఇప్పటి దాకా 1,000 నాటకాల్లో పలు పాత్రల్లో నటించి ఉంటాను.

ఎస్కేయూలో విద్యాభ్యాసం..
ఎస్కే యూనివర్సిటీలో చదువు పూర్తి చేసుకుని ఆరేళ్ల పాటూ కాంట్రాక్టర్‌గా పని చేశాను. 2020 వరకు పశుసంవర్ధక శాఖలో ఉద్యోగిగా పని చేసి ఉద్యోగ విరమణ చేశాను. ఈ మధ్య కాలంలో వందల నాటకాల్లో పాలు పంచుకున్నాను. కర్ణుడు, భీముడు, హరిశ్చంద్రుడు, కృష్ణుడు, రాముడు, సుయోధనుడు, నారదుడు ఇలా నేను వేసిన ప్రతి పాత్ర నాకు ఎంతో పేరు తెచ్చిపెట్టింది.

వైఎస్ కుటుంబంతో సాన్నిహిత్యం
నా నటజీవితం ప్రసిద్ధ రాజకీయ దిగ్గజాలతోనూ ముడిపడిపోవడం కొంత గర్వంగా ఉంది.
నేను పులివెందుల్లో పెళ్లి చేసుకున్నాను. మా మామ వాళ్లు వైఎస్ రాజశేఖరరెడ్డి, భాస్కరరెడ్డి వాళ్లకు అత్యంత సన్నిహితులు కావడంతో నాకూ వారితో పరిచయాలు ఏర్పడ్డాయి. మా వదిన సుజాత వైఎస్ విజయమ్మ క్లాస్‌మెట్స్‌గా ఉండేవారు. అలా సరదాగా నా పద్యాలు వారికి వినిపించేవాడిని. మా సీనియర్స్ రఘువీరారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి వంటి వారు కూడా ఎంతో సన్నిహితులే.

దాసరి సినిమా చాన్స్ ఇచ్చారు..
మొదట సినిమాల్లోకి వెళ్లాలనిపించేది. అలా దిగ్గజ నటుడు దాసరి నారాయణరావు చొరవతో బొబ్బిలి బ్రహ్మన్న, తాండ్ర పాపారాయుడు, విశ్వనాథ కథానాయకుడు వంటి సినిమాల్లో చిన్న వేషాలు వేశాను. పేకేటి శివరాం, సుత్తివేలు వంటి సినీనటులతో సన్మానాలు అందుకున్నాను. ప్రసిద్ధ నటులు శివాజీ గణేషన్, కృష్ణ వంటి వారితో కలిసి నటించే అవకాశమూ వచ్చింది. కానీ సంతృప్తినిచ్చే పాత్రలు రావని తెలుసుకుని మళ్లీ నాటక రంగంపైనే నటిస్తూ జీవిస్తున్నాను. హైదరాబాద్, చెన్నై పట్టణాల్లో నేపథ్య గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, రామకృష్ణ, ఎస్.జానకి వంటి వారితో సాన్నిహిత్యమున్నా అనేక కారణాలతో జిల్లాలోనే స్థిరపడిపోయాను.

గుర్రం జాషువా అవార్డుతో సత్కారం..
నేను నాటక రంగంపై వేసిన దాదాపు ప్రతి పాత్రకు అవార్డు వచ్చింది. ఎన్నో కళా సంస్థల వారు నాకు జాతీయ స్థాయి అవార్డులు అందజేశారు. 2021లో గుర్రం జాషువా అవార్డు, 2022లో ఎంజీఆర్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించారు.

గిన్నిస్ రికార్డు కోసం కృషి



రంగస్థలంపై పద్యాలు పాడి అందరినీ అలరించడం అందరం చేస్తుండేదే. కానీ అనంత కీర్తి చిరస్థాయిగా మిగిలిపోవడానికి అరుదైన కార్యక్రమాన్ని చేపడుతున్నాను. శ్రీకృష్ణరాయబారం నాటకంలోని అన్ని పాత్రలను ఒక్కడినే అభినయిస్తూ 180 పద్యాలను ఏకధాటిగా చెప్పే కార్యక్రమాన్ని మూడేళ్ల కిందటే చేయాలనుకున్నాను. కరోనా రాకతో ఆగిపోయింది. అతి త్వరలో అనంత కీర్తిని జాతీయ స్థాయిలో రెపరెపలాడేలా చేయాలన్నదే నా తపన.

– గాజుల వెంకట సుబ్బయ్య

సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్



అనంతపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున, ఆ తరువాత ప్రశాంతత లోపించకుండా అందరూ సహకరించాలని అనంతపురం అర్బన్ డీఎస్పీ టీవీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. గురువారం అనంతపురం మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాలుగు, ఐదు, ఆరో రోడ్డు, ఎంజీ పెట్రోలు బంకు సమీపంలోని సర్వీసు రోడ్డు, నడిమివంకల మీదుగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో కవాతు కొనసాగింది. ఏవైనా సమస్యలు ఉంటే ఆయా స్థానిక పోలీసుల దృష్టికి తీసుకెళ్లి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. గొడవలు, అల్లర్లు జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో నగర సీఐలు వి.రెడ్డప్ప, ఆర్.ప్రతాప్ రెడ్డి, నారాయణ రెడ్డి, ఎస్‌ఐ గోపాలుడు తదితరులు పాల్గొన్నారు.